నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్-నిర్మల్
5 | నిజామాబాద్, మంగళవారం 17 సెప్టెంబర్ 2024 | ADILABAD NIRMAL

వినాయకుల వద్ద రామన్న పూజలు

పూజలు చేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఎదులాపురం, సెప్టెంబర్ 16 : ఆదిలాబాద్ పట్టణంలోని పలు వార్డుల్లో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాల వద్ద మాజీ మంత్రి జోగు రామన్న సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాలక్ష్మి వాడ, భాగ్యనగర్, ఆర్అండ్బీ ప్రెస్ గణేశ్, భుక్తాపూర్, కైలాశ్‌నగర్, న్యూ హౌసింగ్ బోర్డు, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం, ఫిల్టర్ బెడ్, శాంతినగర్ గణేశ్ మండపాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అలాగే అన్నదాన ప్రసాద కార్యక్రమంలో పాల్గొన్నారు. పలు ఆలయాల కమిటీ సభ్యులు రామన్నను శాలువాతో ఘనంగా సత్కరించారు.

సంప్రదాయాలను కాపాడుకోవాలి

తీజ్ బుట్టలను తలపై పెడుతున్న రాథోడ్ జనార్దన్

ఉట్నూర్, సెప్టెంబర్ 16 : ప్రజలు సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని మాజీ జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. సోమవారం స్థానిక జగదాంబ ఆలయంలో తీజ్ ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజన సంప్రదాయాలు గొప్పవన్నారు. వాటిని కాపాడుకుని నేటి తరానికి అందించాలన్నారు. అనంతరం తీజ్ సంప్రదాయ నృత్యాలు చేశారు.

రాణాపూర్ నిమజ్జనంలో ఉత్సాహంగా నృత్యాలు చేస్తున్న మహిళలు

ఊరంతా ఒకేచోట

సోన్, సెప్టెంబర్ 16 : ప్రస్తుతం గల్లీ గల్లీ, వాడవాడన గణపతులను ప్రతిష్ఠిస్తున్న తరుణంలో ఊరంతా కలిసి ఒకే చోట గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేసి పూజలు చేస్తున్నారు. ఈ ఆనవాయితీ దశాబ్దకాలంగా కొనసాగుతున్నది. ఈ ఆనవాయితీ నిర్మల్ మండలంలోని రాణాపూర్ గ్రామ పరిధిలో ఉంది. ఆ ఊరిలో దాదాపు 1000 మంది జనాభా నివసిస్తున్నారు. వారంతా కలిసి ఒకే నిర్ణయానికి కట్టుబడి గణేశ్ మండపాన్ని ఏర్పాటు చేసి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. గణనాథుల వద్ద అంతా కలిసి ఐక్యంగా పూజలు చేయడం వల్ల బృంద స్ఫూర్తిని ప్రదర్శిస్తున్నారు. ఇలా తొమ్మిది రోజుల పాటు పూజలందుకున్న గణనాథుడిని సోమవారం నిమజ్జనాన్ని నిర్వహించారు.

రైతుకు భరోసా ఏదీ?

● ముగుస్తున్న వానకాలం ● పంటలు నష్టపోయి రైతుల అవస్థలు ● యాసంగి పెట్టుబడులకు అప్పులు

ఆదిలాబాద్, సెప్టెంబర్ 16(నమస్తే తెలంగాణ) : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం అన్నదాతలను ఆదుకునేందుకు రైతుబంధు పథకంలో భాగంగా ఎకరాకు రూ.10 వేల ఆర్థిక సాయం అందించింది. వానకాలం, యాసంగికి ముందుగానే రైతుల బ్యాంకు ఖాతాల్లో రైతుబంధు డబ్బులు జమ అయ్యేవి. దీంతో రైతులు రెండు సీజన్‌లలో తమకు అవసరమైన విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసుకునే వారు. బీఆర్ఎస్ సర్కారు అందిస్తున్న సాయం ఫలితంగా రైతులకు పెట్టుబడులకు ఇబ్బందులు ఉండేవి కావు. గతంలో రైతులు విత్తనాలు, ఎరువుల కోసం దళారుల వద్ద అప్పులు చేసేవారు. అధిక వడ్డీలు చెల్లించాల్సి వచ్చేది. అప్పులు ఇచ్చిన దళారులు రైతులు పండించిన పంటలను తమకే అమ్మాలని షరతులు విధించేవారు. దీంతో రైతులు నష్టపోవాల్సి వచ్చేది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన రైతుబంధు పథకం ఫలితంగా అన్నదాతలకు అప్పుల బాధలు దూరమయ్యాయి.

రైతు భరోసా ఎప్పుడు?

కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీలను ప్రకటించింది. ఇందులో రైతు భరోసా పథకంలో భాగంగా ఎకరాకు రూ.15 వేల ఆర్థిక సాయం అందిస్తామని తెలిపింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు దాటినా ఈ పథకం ఇంకా అమలుకు నోచుకోలేదు. రైతు భరోసా పథకం అమలులో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం పలువురు మంత్రులతో కూడిన సబ్ కమిటీ వేసి రైతుల అభిప్రాయ సేకరణ చేపట్టింది. కమిటీ సభ్యులు జిల్లాలో రైతుల అభిప్రాయ సేకరణ కోసం ఉట్నూర్‌లో పర్యటించారు. కమిటీ పర్యటనలు పూర్తయి రెండు నెలలు దాటినా పథకం అమలు విషయంలో నిర్ణయం తీసుకోలేదు. వానకాలం రైతులకు పంట పెట్టుబడి సాయం అందకపోవడంతో అప్పులు చేయాల్సి వచ్చింది. సీజన్ ముగుస్తున్నా రైతు భరోసా అందకపోవడంతో అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాల కారణంగా అన్నదాతలు పంటలు నష్టపోయారు. దీంతో పెట్టుబడి అప్పులు కట్టలేని పరిస్థితులు నెలకున్నాయి. జిల్లాలో చాలా మంది రైతులకు రుణమాఫీ జరగలేదు. వానకాలం పంటలకు అప్పులు చేయడం, పంటలు నష్టపోవడంతో రైతుల పరిస్థితి అయోమయంగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం తమకు రెండు సీజన్‌లకు సంబంధించిన రైతు భరోసా అందించాలని అన్నదాతలు కోరుతున్నారు.

శోభాయాత్రలో నృత్యాలు చేస్తున్న యువకులు

గణేశ్ నిమజ్జనం

ఇంద్రవెల్లి, సెప్టెంబర్ 16 ః భక్తిశ్రద్ధలతో తొమ్మిది రోజులు పూజలు అందుకున్న వినాయక విగ్రహాలను భక్తులు సోమవారం రాత్రి నిమజ్జనం చేశారు. మండల కేంద్రంతోపాటు ఎస్టీగోండ్‌గూడ, ప్రధాన్‌గూడ, మిలిందన్‌గర్, భీమ్‌నగర్, హనుమాన్‌గల్లి, బజార్‌గల్లి, సాయినగర్ గ్రామాల్లో గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో శకటాలను రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. మంగళవారం తెల్లవారు జాము వరకు భారీ శోభాయాత్ర నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, యువకులు, భక్తులు నృత్యాలు చేస్తూ సందడి చేశారు. అనంతరం ఏమాయికుంట గ్రామ సమీపంలోని గురుదేవ్ చెరువులో నిమజ్జనం చేశారు. ఎస్ఐ సునీల్ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంద్రవెల్లి గ్రామ పటేల్, పీఏసీఎస్ చైర్మన్ మారుతి పటేల్ డోంగ్రే, ఆయా పార్టీలకు చెందిన నాయకులు దీపక్‌సింగ్ షేకావత్, కనక తుకారాం, ఆర్కా ఖమ్ము, ఆరెల్లి రాజలింగు, ముకాడే ఉత్తం, సోమం రాందాస్, దేవ్‌పూజె మారుపతి, మరప రాజు, గేడం జ్ఞానేశ్వర్, కోరెంగ సుంకట్‌రావ్, గణేశ్ టేహేరే, కదం మహేశ్, కేశవ్ పటేల్, చాహకటి నాగోరావ్, చింతావార్ సంతోష్, ప్రకాశ్, విశ్వనాథ్, దేవీదాస్, బాబుముండే, చంపత్ పటేల్, కిశోర్‌కుమార్ పాల్గొన్నారు.

బైక్ ర్యాలీలో పాల్గొన్న సీపీఎం నాయకులు

మతాల మధ్య జరిగిన పోరాటంగా చిత్రీకరిస్తున్నారు

సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్

ఎదులాపురం, సెప్టెంబర్ 16 : భూమి, భుక్తి కోసం జరిగిన తెలంగాణ సాయుధ పోరాటాన్ని బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు మతాల మధ్య జరిగిన పోరాటంగా చిత్రీకరిస్తున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్ ఆరోపించారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా సోమవారం పార్టీ కార్యాలయం నుంచి బైక్ ర్యాలీ చేపట్టారు. పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ కొనసాగింది. ర్యాలీలో పోరాటం జరిగిన తీరును వివరిస్తు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మల్లేశ్ మాట్లాడుతూ.. నిజాం సర్కార్, పెత్తందారులకు వ్యతిరేకంగా కుల,మతాలకు అతీతంగా తెలంగాణ సాయుధ పోరాటం సుదీర్ఘంగా కొనసాగిందన్నారు. ఇందులో దాదాపు 4 వేలకు పైగా మంది అమరులయ్యారని తెలిపారు. అయితే బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు మాత్రం కులాల మధ్య జరిగిన ఉద్యమంగా ప్రచారం చేయడం సరికాదన్నారు. దీని గురించి నేటి తరం యువతకు తెలియజేయడానికి పార్టీ తరపున వారోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బండి దత్తాత్రి, లంక రాఘవులు, లింగాల చిన్నన్న, లంక జమున, సురేందర్, మంజుల, శకుంతల, పూసం సచిన్ పాల్గొన్నారు.

తల్లిదండ్రుల కండ్ల ముందే..

ప్రమాదవశాత్తు క్వారీ నీటి గుంతలో పడ్డ బాలిక

● పొట్టకూటి కోసం వలస వచ్చిన కుటుంబంలో విషాదం ● గజ ఈతగాళ్ల తో మృతదేహం వెలికితీత

బిడ్డను పోగొట్టుకున్న బాధలో తల్లిదండ్రులు

పిప్పిరిలో బాలిక పడ్డ నీటి గుంత ఇదే..

బజార్‌హత్నూర్, సెప్టెంబర్ 16 ః బతుకుదెరువు కోసం రాష్ట్రాలు దాటి జీవనోపాధి కోసం వలస వచ్చిన వారి కుటుంబంలో విషాదం నింపింది. బజార్‌హత్నూర్ మండలంలోని పిప్పిరి గ్రామ సమీపంలో గల కంకర మిషన్ క్వారీ గుంతలో పడి పన్నెండేళ్ల బాలిక సోమవారం మృతి చెందింది. ఎస్సై అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన భరత్-గాయత్రి దంపతులు కంకర మిషన్‌లో యేడాది కాలంగా కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వీరికి ఐదుగురు సంతానం కాగా.. రెండో కూతురైన సంజన(12) కంకర మిషన్ ఆవరణలో ఉన్న క్వారీ వైపు వెళ్లింది. ప్రమాదవశాత్తు గుంతలో పడి మృతి చెందింది. అక్కడే ఉన్న తల్లిదండ్రులు తమ బిడ్డ నీటిలో మునిగిపోవడం చూసి కన్నీరుమున్నీరయ్యారు. దీంతో విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రెండు గంటలపాటు గజ ఈతగళ్లతో వెతికి బాలిక మృతదేహాన్ని వెలికితీశారు. తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తామని ఎస్సై తెలిపారు. కాగా.. క్వారీ యాజమాన్యం నీటి గుంత చుట్టూ కంచె ఏర్పాటు చేయకపోవడం మైనింగ్ శాఖ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం.

సంజన(ఫైల్)

వినాయకుడి విగ్రహం ఎదుట ప్లెక్సీలతో నిరసన తెలుపుతున్న జూడాలు

జూడాల నిరసన

ఎదులాపురం, సెప్టెంబర్ 16 : బెంగాల్‌లో లైంగికదాడి, హత్యకు గురైన వైద్యురాలు అభయ కేసులో న్యాయం జరగాలంటూ సోమవారం సాయంత్రం ఆదిలాబాద్‌లోని రిమ్స్ జూనియర్ డాక్టర్లు నిరసన చేపట్టారు. విధుల్లో భాగంగా నల్లబ్యాడ్జీలు ధరించిన జూడాలు, వినాయకుడి వద్ద పూజలు చేసి న్యాయం చేయాలని కోరుకున్నారు. బెంగాల్ ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఇప్పటి వరకు సుప్రీంకోర్టు తీరు తీవ్ర నిరాశను కలుగజేసిందని, కోర్టులో 17న హియరింగ్ ఉన్నందున దేశవ్యాప్తంగా రెసిడెంట్ డాక్టర్లు అభయకు న్యాయం జరగాలని నిరసన చేపట్టారన్నారు. ఇందులో భాగంగా తాము కార్యక్రమం చేసినట్లు తెలిపారు. ఇందులో జూడా ప్రతినిధులు అన్వేశ్, అభినయ్, ప్రత్యూషా, శ్యాం పాల్గొన్నారు.

శిశువుకు అంతిమ సంస్కారం

అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

ఎదులాపురం, సెప్టెంబర్ 16 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని కుంచన్‌పల్లి గ్రామానికి చెందిన ఆదివాసీ మహిళ మడావి సక్రుబాయి నాలుగు రోజుల క్రితం మగ శిశువుకు జన్మనిచ్చింది. సోమవారం ఆ బాబు అనారోగ్యంతో మృతి చెందాడు. పుట్టెడు దుఃఖంలో ఉన్న సక్కుబాయి-గోవింద్ దంపతులు తమ బంధువులు, స్నేహితులకు ఫోన్లు చేసినా ఎవరూ రాలేదు. ఈ విషయం బెస్ట్‌ఫ్రెండ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన హ్యూమన్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఇంతేకాబ్ ఆలం సహకారంతో స్థానిక పిట్టలవాడ వైకుంఠధామంలో హిందూ సంప్రదాయపద్ధతిలో అంతిమ సంస్కారం నిర్వహించారు. సొసైటీ వారికి ఆ ఆదివాసీ దంపతులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు పి.శ్రీకాంత్, సలహాదారులు ఎస్కే నాహిద్, పి.భవాన సింగ్ ఉన్నారు.

పత్తి చేనులో అంతర పంటగా సాగవుతున్న గంజాయి

అంతర పంటగా గంజాయి సాగు

బజార్‌హత్నూర్ మండలంలోని 30 గ్రామాల్లో సాగవుతున్న పత్తి, కంది, మక్క, జొన్న పంటల్లో అంతర పంటగా గంజాయి సాగవుతున్నది. రాష్ట్ర ప్రభుత్వం మాదక ద్రవ్యాలను నిర్మూలించాలని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నది. వ్యాపారులు మాత్రం అమాయక గిరిజన రైతులకు డబ్బులను ఏరగా చూపి అంతర పంటగా గంజాయి సాగును ప్రోత్సహిస్తున్నారు. మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతం దగ్గరగా ఉండడంతో పండించిన గంజాయిని సులవుగా ఇతర ప్రాంతాలకు వ్యాపారులు ఎగుమతి చేస్తున్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి గంజాయి సాగును ప్రోత్సాహించే వ్యాపారులను పట్టుకుని శిక్షించాలని ప్రజలు కోరుతున్నారు. ***- బజార్‌హత్నూర్, సెప్టెంబర్ 16***

విధులపై నిర్లక్ష్యం చేయద్దు

ఎదులాపురం, సెప్టెంబర్ 16 : వైద్యులు, సిబ్బంది విధులపై నిర్లక్ష్యం చేయవద్దని డీఎంహెచ్‌వో కృష్ణ అన్నారు. సోమవారం హమాలీవాడ, చిలుకూరి లక్ష్మీనగర్‌లోని యూపీహెచ్‌సీలను జిల్లా మలేరియా నివారణాధికారి శ్రీధర్‌తో కలిసి తనిఖీ చేశారు. ఓపీ సేవలు, రికార్డులను పరిశీలించారు. ప్రధానంగా డెంగ్యూ, మలేరియా, విషజ్వరాల కేసులపై ఆరా తీశారు. కచ్చితంగా వారంలో రెండు రోజులు డ్రై డే నిర్వహించాలని సూచించారు. అనంతరం అంకోలి పీహెచ్‌సీ పరిధిలోని భీంసరి గ్రామాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు, ల్యాబ్ టెక్నిషియన్ బండారి కృష్ణ పాల్గొన్నారు.

రిమ్స్‌లో మలేరియా ల్యాబ్ తనిఖీ

రిమ్స్‌లోని మలేరియా ల్యాబ్‌ను సోమవారం డీఎంహెచ్‌వో కృష్ణ తనిఖీ చేశారు. కేసులు ఎన్ని నమోదయ్యాయనే వివరాలను టెక్నీషియన్‌ను అడిగి తెలుసుకున్నారు. పరీక్షలు జాగ్రత్తగా చేయాలని సూచించారు. డీఎంహెచ్‌వో వెంట జిల్లా మలేరియా నివారణాధికారి శ్రీధర్ ఉన్నారు.

భీంసరిలో డెంగ్యూ పాజిటివ్ కేసు వివరాలను తెలుసుకుంటున్న డీఎంహెచ్‌వో

నిమజ్జనానికి సిద్ధం

● భారీ భద్రతా వలయంలో నిర్మల్ ● నేడు నిర్మల్, ఖానాపూర్‌లలో వినాయకుల నిమజ్జనం ● శోభాయాత్రను ప్రారంభించనున్న ఎమ్మెల్యే, ఎస్పీ

● ఏర్పాట్లు పూర్తి చేసిన మున్సిపల్, ఇతర శాఖలు ● వినాయక్ సాగర్ వద్ద క్రేన్‌లు, గజ ఈతగాళ్ల ఏర్పాట్లు ● శాంతియుతంగా నిర్వహిస్తాం :ఎస్పీ జానకి షర్మిల

నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల, సిబ్బంది

నిర్మల్ అర్బన్, సెప్టెంబర్ 16 : నవరాత్రోత్సవాలు విశేష పూజలు అందుకున్న వినాయకులు గంగమ్మ ఒడికి చేరుకోనున్నాయి. నిర్మల్ జిల్లాలో దాదాపు 3 వేల వినాయక ప్రతిమలను ప్రతిష్ఠించగా.. ఐదు, ఏడు, తొమ్మిది రోజులలో నిమజ్జన పర్వం కొనసాగింది. అత్యంత సమస్మాత్మక ప్రాంతాలైన ముథోల్, భైంసాలలో పోలీసు యంత్రాంగం తిష్ట వేసి, ఎస్పీ జానకి షర్మిల నిమజ్జనాన్ని ప్రశాంతంగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించారు. అదే తరహాలో నిర్మల్, ఖానాపూర్‌లలో మంగళవారం జరిగే నిమజ్జన శోభాయాత్రను నిర్వహించేందుకు పోలీసు శాఖ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లను చేపట్టింది. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకున్న తక్షణమే పరిష్కరించే విధంగా దృష్టి సారించారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో సీరియల్ నంబర్ల ఆధారంగా నిమజ్జన శోభాయాత్ర జరగనుంది. సీరియల్ నంబర్ల ఆధారంగా స్థానిక వినాయక్‌సాగర్‌లో నిమజ్జనాన్ని చేపట్టనున్నారు. ఖానాపూర్ నియోజకవర్గ కేంద్రంలో 17 వినాయకులను మండపాల నిర్వాహకులు, ఉత్సవ సమితి సభ్యులు నిమజ్జనం చేయనున్నారు.

భారీ భద్రతా వలయంలో నిర్మల్

బుధవార్‌పేట్ నుంచి బంగల్‌పేట్ వినాయక్‌సాగర్ నిమజ్జన ప్రదేశం వరకు తొమ్మిది సెక్టార్లను ఏర్పాటు చేశారు. గాంధీచౌక్ నుంచి బుధవార్‌పేట్ ఎక్స్ రోడ్డు వరకు ఒక సెక్టార్ కాగా.. ఇలా తొమ్మిది సెక్టార్లను పోలీసుశాఖ ప్రత్యేకంగా ఏర్పాటు చేసి భద్రతను పర్యవేక్షిస్తున్నది. ఇప్పటికే నార్త్ జోన్ ఐజీ చంద్రశేఖర్ నిర్మల్ జిల్లా కేంద్రంలో పర్యటించి భద్రతను పర్యవేక్షించారు. నిర్మల్ జిల్లా ఫోర్స్ 220 మంది ఉండగా.. ఇతర ప్రాంతాల నుంచి 600 మంది పోలీసులు ఉత్సవాల్లో విధులు నిర్వహించనున్నారు. ఇందులో 400 మంది ట్రెయినీ పోలీసులు, 220 మంది జిల్లా ఫోర్స్, ఇద్దరు అడిషనల్ ఎస్పీలు, ఐదుగురు డీఎస్పీలు, 30 మంది సీఐలు, 40 మంది ఎస్సైలు, కేంద్ర బలగాలు బందోబస్తును నిర్వహించనున్నాయి. స్థానిక బుధవార్‌పేట్ నుంచి ప్రారంభమైన శోభాయాత్ర పాత బస్టాండ్, రూరల్ పోలీస్ స్టేషన్, నగరేశ్వర వాడ, పాత మార్కెట్ ఏరియా, గాంధీచౌక్, బంగల్‌పేట్ మీదుగా వినాయక్‌సాగర్ వరకు కొనసాగనున్నది. శోభాయాత్ర పొడవునా 42 సీసీ కెమరాలను ఏర్పాటు చేసి కంట్రోల్ రూంకు అటాచ్ చేశారు. దీంతోపాటు 10 సోలార్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.

ఏర్పాట్లు చేసిన మున్సిపల్, ఇతర శాఖలు

నిర్మల్, ఖానాపూర్‌లలో జరిగే నిమజ్జన శోభాయాత్రకు మున్సిపల్, విద్యుత్, రెవెన్యూ, అగ్నిమాపక శాఖల అధికారులు అన్ని ఏర్పాట్లు చేపట్టారు. మున్సిపల్ అధికారులు రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చి, ఐదు ఏరియాల్లో జనరేటర్లను ఏర్పాటు చేశారు. 500ల వరకు అదనపు విద్యుద్దీపాలను ఏర్పాటు చేశారు. శోభాయాత్ర మార్గాన పురాతన స్తంభాలను తొలగించి 11 మీటర్ల ఎత్తయిన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. వినయక్‌సాగర్ వద్ద 12 మంది గజ ఈతగాళ్లు, క్రేన్‌లు, రెండు బృందాల ఫైర్ సిబ్బందిని అందుబాటులో ఉంచారు.

శోభాయాత్రను ప్రారంభించనున్న ఎమ్మెల్యే, ఎస్పీ

నిర్మల్ పట్టణంలోని బుధవార్‌పేట్ వద్ద నెలకొల్పిన వినాయన నిమజ్జన శోభాయాత్రను మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభించనున్నారు. ఈ శోభాయాత్రకు నిర్మల్ ఎమ్మెల్యే, బీజేపీ శాసనసభా పక్షనేత మహేశ్వర్‌రెడ్డి, ఎస్పీ జానకి షర్మిల, కలెక్టర్ అభిలాష అభినవ్ వినాయకుడికి పూజలు నిర్వహించి శోభాయాత్రను ప్రారంభించనున్నారు. కాగా.. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ప్రార్థన స్థలాల వద్ద ప్రత్యేక నిఘా పెట్టారు.



నిమజ్జన శోభాయాత్ర రూట్ మ్యాప్

ఏర్పాట్లు పూర్తి చేశాం..

నిర్మల్, ఖానాపూర్‌లలో మంగళవారం జరిగే నిమజ్జన శోభాయాత్రకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశాం. శోభాయాత్రను ప్రశాంతంగా నిర్వహించేందుకు భారీ బందోబస్తు ఉంచాం. సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం. ముథోల్, భైంసా తరహాలో ప్రశాంతంగా నిర్వహిస్తాం. ప్రజలందరు పూర్తి సహకారం అందించాలి.

- జానకి షర్మిల, ఎస్పీ, నిర్మల్